క్లుప్తంగా

ముగిసిన ఎంపీఈడీ సెమిస్టర్ పరీక్షలు



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఆచార్య పల్లవి

విశాఖ విద్య : ఆంధ్ర విశ్వవిద్యాలయం డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ సైన్సెస్ విభాగంలో ప్రథమ సంవత్సరం మాస్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ సెమిస్టర్ పరీక్షలు గురువారంతో ముగిశాయి. వ్యాయామ విద్యా విభాగం హెడ్ ఆచార్య ఎ.పల్లవి పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. కమ్యూనికేషన్ స్కిల్స్ పరీక్ష ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు జరిగాయి. అలాగే గొన్నా కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్, ప్రగతి కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్, వరలక్ష్మి కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్, కోడి రామ్మూర్తి కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో ఎంపీఈడీ పరీక్షలు ముగిసినట్లు వర్సిటీ అధికారులు తెలిపారు.

వేణుగాన విద్వాంసుడు నవీన్‌కుమార్ ఏయూ సందర్శన



నవీన్‌కుమార్‌ను సత్కరిస్తున్న రిజిస్ట్రార్ ధనుంజయరావు

విశాఖ విద్య : ప్రముఖ వేణుగాన విద్వాంసుడు, సంగీత దర్శకుడు పి.ఎం.కె.నవీన్‌కుమార్ గురువారం ఏయూలోని సెయింట్ లూక్స్ ఆడియో ఇంజినీరింగ్ మ్యూజిక్ ప్రొడక్షన్ విభాగాన్ని సందర్శించారు. ఆధునిక ప్రమాణాలతో నిర్మించిన సెయింట్ లూక్స్ డిజిటల్ స్టూడియో చూసి ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశారు. ఆడియో ఇంజినీరింగ్, మ్యూజిక్ ప్రొడక్షన్ విద్యార్థులకు, వుడ్ విండ్స్ వాయిద్యం విభాగంలో మాస్టర్ క్లాస్ నిర్వహించారు. వేణుగానం మెలకువలను విద్యార్థులకు నేర్పించారు. కార్యక్రమంలో సెయింట్ లూక్స్ ఆడియో ఇంజినీరింగ్ అండ్ మ్యూజిక్ ప్రొడక్షన్ విద్యార్థులతో పాటు డైరెక్టర్ ఆశీర్వాద్ లూక్, సుమన్ జీవరతన్, ప్రీతంలూక్ వర్సిటీ ఫైన్ ఆర్ట్స్ డిపార్ట్‌మెంట్ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య. ఇ.ఎస్.ధనుంజయరావు తన కార్యాలయంలో నవీన్‌కుమార్‌ను సత్కరించారు.

ఉత్సాహంగా తిరంగా ర్యాలీ



తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్న బుల్లయ్య కళాశాల విద్యార్థులు

సీతంపేట : లంకపల్లి బుల్లయ్య కళాశాల విద్యార్థులు తిరంగా ర్యాలీ గురువారం ఉత్సాహంగా నిర్వహించారు. 75వ రిపబ్లిక్ డే వేడుకల సందర్భంగా 75 అడుగుల మువ్వన్నెల జెండాతో కళాశాల అధ్యాపక సిబ్బంది, ఎన్‌సీసీ, ఎన్‌ఎస్ఎస్, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ క్యాడెట్లు పాల్గొని సుమారు 4.2 కిలో మీటర్లు ర్యాలీ నిర్వహించారు. కళాశాల వద్ద ప్రారంభమైన ర్యాలీ వీఐపీ రోడ్, ఆశీలుమెట్ట జంక్షన్, జీవీఎంసీ గాంధీ విగ్రహం, రామాటాకీస్ మీదుగా కళాశాలకు చేరుకుంది. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జీ.ఎస్.కె.చక్రవర్తి, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

చెత్త శుద్ధి ఏదీ?



లాసన్స్ బే కాలనీలోని రోడ్డుపై గుట్టలుగా చెత్త



తుడిచిన చెత్త రోడ్డుమీదే కుప్పలా..

- లాసన్స్‌బే కాలనీలో అధ్వానంగా పారిశుధ్య నిర్వహణ
- వీధుల్లో కుప్పలుగా చెత్త, మద్యం బాటిల్స్
- అపరిశుభ్రంగా రోడ్లు
- యథేచ్ఛగా భవన నిర్మాణ వ్యర్థాల డంపింగ్ – పట్టించుకోని అధికారులు, సిబ్బంది

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ సెక్టార్–12, లాసన్స్ బే కాలనీలో పారిశుధ్య సమస్య రోజురోజుకూ పెరుగుతోంది. ఏ వీధిలో చూసినా రోడ్డు పక్కన చెత్త గుట్టలు, భవన నిర్మాణ వ్యర్థాలే దర్శనమిస్తున్నాయి. పారిశుధ్య నిర్వహణలో సిబ్బంది నిర్లక్ష్యంపై కాలనీ మహిళల నుంచి ఫిర్యాదులు పెరుగుతున్నాయి. కొన్ని రోజులుగా వ్యర్థాలు సక్రమంగా తరలించడం లేదని వారు ఆరోపిస్తున్నారు. దీనికి తోడు కాలనీలోని పలు చోట్ల రోడ్లపైనే పశువులను కడుతుండటంతో దుర్వాసన భరించలేకపోతున్నామని పేర్కొన్నారు. స్థానిక శానిటరీ ఇన్‌స్పెక్టర్, సూపర్‌వైజర్లు, మేస్త్రీలకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు.



భవన నిర్మాణ వ్యర్థాలు, మద్యం బాటిల్స్

ప్రకటనలే.. అమలేది?

పారిశుధ్య నిర్వహణలో విశాఖను అగ్రభాగాన నిలుపుతామని జీవీఎంసీ ఉన్నతాధికారులు ప్రకటిస్తున్నా క్షేత్రస్థాయిలో మాత్రం అమలు కావడం లేదని పలువురు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పారిశుధ్య నిర్వహణపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పశువుల కొట్టంలా రోడ్లు

స్మార్ట్ కాలనీగా ఉన్న ఎంవీపీ కాలనీ సెక్టార్–12లోని లాసన్స్‌బే కాలనీలోని పశువుల బెడద స్థానికులకు పెద్ద సమస్యగా మారింది. కాలనీ సచివాలయం రోడ్డులో యథేచ్ఛగా రోడ్లపైనే పశువులను కడుతుండటంతో స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారు. పశువులు రోడ్లను పాడుచేస్తున్నాయని, దీంతో దుర్వాసన భరించలేకపోతున్నామని పలువురు పేర్కొంటున్నారు. రోడ్లపై పశువులను కడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్‌కు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని పేర్కొన్నారు.

రోడ్లు చెత్తమయం

గతంలో ఎన్నడూ లేనివిధంగా లాసన్స్ బే కాలనీలో పారిశుధ్య సమస్య తలెత్తుతోంది. కాలనీలోని చాలా రహదారుల్లో భవన నిర్మాణ వ్యర్థాలు డంప్ చేస్తుండటం, రోజుల తరబడి వాటిని తొలగించకుండా వదిలేయడంతో డెబ్రిస్ గుట్టలుగా పేరుకుపోతోంది. దీనికి తోడు స్థానికులు ఆయా గుట్టల వద్దే వ్యర్థాలు, మద్యం బాటిల్స్ కుప్పలుగా వేస్తుండటంతో ఆయా ప్రాంతాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. ఆ నిర్మాణ వ్యర్థాలు తొలగించాలని స్థానికులు ఫిర్యాదు చేస్తున్నా పారిశుధ్య సిబ్బంది పట్టించుకోవడం లేదు. దీంతోపాటు పారిశుధ్య సిబ్బంది పలు రోడ్లను ఉదయం పూట తుడుస్తున్నా చెత్తను ఎప్పటికప్పుడు తరలించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. చెత్తను రోడ్ల పక్కన రోజుల తరబడి కుప్పలుగా వదిలేస్తున్నారు. దీంతో పలు రోడ్లు అధ్వానంగా మారుతున్నాయి.



రోడ్డుపైనే పశువులను కట్టిన దృశ్యం

రోడ్లపైనే పశువులు, వాటి వ్యర్థాలు

గతంలో మా కాలనీలో రోడ్లు చాలా శుభ్రంగా ఉండేవి. కొద్దికాలంగా ఆ పరిస్థితి లేదు. సచివాలయం రోడ్డులో పశువులు రోడ్డుపైనే ఉంటున్నాయి. ఆ వ్యర్థాలు రోడ్డుపై ఉండటంతో దుర్గంధం భరించలేకపోతున్నాం. పశువులను రోడ్డుపై కట్టకుండా చర్యలు తీసుకోవాలని చాలాసార్లు అధికారులకు ఫిర్యాదు చేశాం. కానీ వారు పట్టించుకోకపోవడంతో పరిస్థితి ఇలా తయారైంది.

– వి.వెంకటేష్, లాసన్స్ బే కాలనీ

డెబ్రిస్ డంప్ చేస్తున్నారు

కాలనీలో భవన నిర్మాణ వ్యర్థాలు గుట్టలుగా ఉంటున్నాయి. గుర్తుతెలియని వ్యక్తులు రాత్రిపూట వాటిని ఇక్కడ డంప్ చేసి వెళ్లిపోతున్నారు. రోజుల తరబడి వాటిని అలా వదిలేస్తున్నారు. కొందరు అక్కడే చెత్త, మద్యం బాటిల్స్ వేసేస్తున్నారు. వాటిని తొలగించి రహదారులను శుభ్రంగా ఉంచాలని పారిశుధ్య సిబ్బందికి చెబుతున్నా పట్టించుకోవడం లేదు. రోడ్లను ఊడ్చిన చెత్త కూడా ఎప్పటికప్పుడు తరలించకపోవడంతో గాలికి మళ్లీ రోడ్డంతా చెత్తగా మారుతోంది.

– పి.రామ్‌కుమార్, లాసన్స్ బే కాలనీ

ఏయూ వీసీగా స్థానికులకే అవకాశం ఇవ్వాలి



వీసీ భవనం ముందు ఆచార్యుల ప్రదర్శన

విశాఖ విద్య : ఆంధ్ర యూనివర్సిటీ వైస్ చాన్సలర్ పోస్టులో స్థానికులనే నియమించాలని వర్సిటీ ఆచార్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం వర్సిటీ రిజిస్ట్రార్ భవనం ముందు నిరసన తెలిపారు. వందేళ్ల ఉత్సవాలకు సిద్ధమవుతున్న తరుణంలో స్థానిక ప్రొఫెసర్‌ను మాత్రమే వీసీగా నియమించాలన్నారు. యూనివర్సిటీ మీద అవగాహన లేని బయట వ్యక్తిని వీసీగా నియమిస్తే అనేక సమస్యలు ఉత్పన్నమవుతాయన్నారు. ఏయూలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయ పోస్టుల భర్తీ ప్రక్రియ స్థానిక ఆచార్యునితోనే సాధ్యమవుతుందని, ఇక్కడ విద్యార్థులు, ఉద్యోగులపై స్థానికులకైతేనే అవగాహన ఉంటుందన్నారు. నిరసనలో అసిస్టెంట్ ప్రొఫెసర్లు, గెస్ట్ ఫ్యాకల్టీ, నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ నాయకులు, వర్సిటీ అసోసియేషన్ల నాయకులు ఆచార్య జాలాది రవి, అర్జునుడు, హరీష్, వర్మ, జీకేడీ ప్రసాద్, రత్నకర్, సురేష్ మీనన్, పితాని ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు 'జనగణమన స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర'

మద్దిలపాలెం: యాక్ట్ స్వచ్ఛంద సేవా సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 9.45 గంటలకు ఏఎస్ రాజా మైదానంలో 'జనగణ మన స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని యాక్ట్ ప్రతినిధి ప్రతాప్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నగరంలోని వివిధ కళాశాలలకు చెందిన 2000 మంది విద్యార్థులతో సామాజిక అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమాన్ని మేయర్ గొలగాని హరివెంకట కుమారి ప్రారంభిస్తారని తెలిపారు. విశిష్ట అతిథులుగా ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణ బాబు, గంటా శ్రీనివాసరావు, విష్ణుకుమార్ రాజు, మాజీ ఎమ్మెల్సీ పి.వి.ఎస్.మాధవ్, ఆళ్వార్‌దాస్ గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషన్స్ ఈడీ రాహుల్ కలవర దాస్ హాజరవుతారని తెలియజేశారు. 2వేల మంది విద్యార్థులతో స్వచ్ఛ భారత్ ప్రతిజ్ఞ చేయించిన అనంతరం జాతీయ గీతాన్ని ఆలపించనున్నట్లు చెప్పారు.

ఏయూలో రక్తదాన శిబిరం



రక్తదాతలైన విద్యార్థులతో వర్సిటీ వీసీ, రిజిస్ట్రార్ తదితరులు

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమాన్ని వీసీ ఆచార్య జి.శశిభూషణరావు, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ విద్యార్థులు రక్తదానం చేయడానికి ముందుకు రావడం సంతోషకరమన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య ధనుంజయరావు మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్యవంతమైన అలవాట్లను కలిగి ఉండాలని కాలానుగుణంగా రక్తదానం చేయాలని సూచించారు. ఇటువంటి సామాజిక స్పృహ కలిగిన కార్యక్రమాలలో యువత భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏయూలో చదువుతున్న భారతీయ విద్యార్థులతో పాటు పలువురు విదేశీ విద్యార్థుల సైతం రక్తదానం చేశారు. రక్తదానం చేసిన విద్యార్థులకు అధికారులు సర్టిఫికెట్లను అందజేసి అభినందించారు. కార్యక్రమంలో అకడమిక్ డీన్ ఆచార్య కె.ఈశ్వర్ కుమార్, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఆచార్య ఎస్.హరినాథ్, దూరవిద్య సంచాలకులు ఆచార్య ఎన్.విజయ మోహన్, అంతర్జాతీయ విద్యార్థుల హాస్టల్స్ చీఫ్ వార్డెన్ డాక్టర్ ఎస్.ఎం.యుగంధర్, విద్యార్థి వ్యవహారాల డీన్ ఆచార్య రాంబాబు, ఆచార్య పాల్ డగ్లస్ పాల్గొన్నారు. విద్యార్థులు స్వచ్ఛందంగా అందించిన రక్తాన్ని ఇండియన్ రెడ్ క్రాస్ రక్తనిధి కేంద్రానికి, ఎన్టీఆర్ ట్రస్ట్ రక్తనిధి కేంద్రాలకు అందజేశారు.

ముడసర్లోవ పార్కు గోడపై నిర్లక్ష్యం

పదేళ్లు దాటినా నిర్మాణానికి నోచుకోని వైనం

ఆరిలోవ: ముడసర్లోవ పార్కు ప్రహరీ గోడ కూలి పదేళ్లు గడుస్తున్నా అధికారులు దృష్టి సారించడం లేదని స్థానికులు, సందర్శకులు ఆరోపిస్తున్నారు. హుద్‌హుద్ తుపాను కంటే ముందే ప్రధాన ద్వారం పక్కన గోడ శిథిలమైంది. ఆ తుపాన్ ధాటికి పలుచోట్ల ప్రహరీ కూలిపోయింది. అప్పటి నుంచి ఈ గోడ నిర్మాణం గురించి జీవీఎంసీ అధికారులు పట్టించుకోలేదు. గతంలో ప్రైవేట్ వ్యక్తులకు కాంట్రాక్ట్ పద్ధతిలో పార్కు బాధ్యతలను జీవీఎంసీ అప్పగించింది. అధికారులు ఇక్కడ గోడ నిర్మాణం చేపట్టకపోవడం, పార్కు లోపల సౌకర్యాలు లేకపోవడంతో సందర్శకులు పెద్దగా వెళ్లడం మానేశారు. గోడ కూలి, ఖాళీ అయిన స్థలాన్నే దొడ్డిదారిగా చేసుకొని ఎక్కువ మంది యువకులు పార్కు లోపలికి టిక్కెట్ లేకుండానే ప్రవేశిస్తున్నారు. దీంతో అనుకున్నంత ఆదాయం రావడం లేదని ప్రైవేట్ వ్యక్తులు పార్కు నిర్వహణ బాధ్యతలకు నిర్వహించే వేలం పాటకు వెళ్లడం మానేశారు. ప్రస్తుతం జీవీఎంసీ అధికారులే ఈ పార్కును నిర్వహిస్తున్నారు. కూలిన రక్షణ గోడ నిర్మించకుండా అధికారులు చూపుతున్న నిర్లక్ష్యంపై స్థానికులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి, పార్కుకు రక్షణ కల్పించాలని కోరుతున్నారు.



ముడసర్లోవ పార్కు ప్రధాన ద్వారం పక్కనే కూలిపోయిన గోడ

బాలికలకు పౌష్టికాహారం అందించాలి

సీతమ్మధార : బాలికలకు తగినంత పౌష్టికాహారం అందేలా చూడాలని జిల్లా మహిళా, శిశు అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ జయదేవి సూచించారు. చినగదిలి మండలం అంగన్‌వాడీ సిబ్బందికి, వార్డు మహిళా సంరక్షణ కార్యదర్శులు, ఏఎన్ఎంలు, స్కూల్ నోడల్ టీచర్లు, విద్యా కార్యదర్శులు, అంగన్‌వాడీ సిబ్బందికి కిశోరీ బాలికల సంరక్షణపై రేసపువానిపాలెంలో గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కిశోరీ బాలికలు రక్తహీనతకు గురికాకుండా అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా తగినంత పౌష్టికాహారం అందజేస్తున్నామని గుర్తు చేశారు. కౌమార దశ పిల్లల ఆరోగ్యం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. బాల్య వివాహాలు జరగకుండా విస్తృతంగా ప్రచారం చేయాలని కోరారు. ఈ నెల 24న జాతీయ బాలికా దినోత్సవాన్ని పండగలా నిర్వహించాలని సూచించారు. సీడీపీవో ఎం.వి.రమణ కుమారి మాట్లాడుతూ కౌమార దశ అనేది చాలా క్లిష్టమైందన్నారు. మెడికల్ ఆఫీసర్ మన్మోహన్, అప్ హోల్డ్ ఎన్జీవో జిల్లా కో ఆర్డినేటర్ డేవిడ్ రాజ్ వివిధ చట్టాలపై వివరించారు. అనంతరం బాల్య వివాహాల నిర్మూలనకు నడుము బిగిద్దాం పేరిట ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఏసీడీపీవో శ్రీలత, ఐసీడీఎస్ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పీడీ జయదేవి

ఫిబ్రవరి 6 నుంచి ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభలు

మద్దిలపాలెం: శ్రీకాకుళంలో ఫిబ్రవరి 6 నుంచి 9వ తేదీ వరకు నిర్వహించనున్న ఏఐవైఎఫ్ 22వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా సమితి సభ్యుడు పడాల గోవింద్ పిలుపునిచ్చారు. సభలకు సంబంధించిన పోస్టర్‌ను ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ఆవిష్కరించారన్నారు. ఈ సభలకు యువత అత్యధికంగా హాజరు కావాలని కోరారు. డ్రగ్స్, గంజాయి, మాదకద్రవ్యాలు వంటి మత్తు పదార్థాలపై యువత పోరాడాలని, అదేవిధంగా ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలనే డిమాండ్ చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి మధు రెడ్డి, గోవింద్, కౌన్సిల్ సభ్యులు రావి అశోక్, తేజ పోలారావు తదితరులు పాల్గొన్నారు.

నేతాజీ ఒక ప్రభంజనం

బీజేపీ జిల్లా అధ్యక్షుడు పరశురామరాజు



నేతాజీకి నివాళులర్పిస్తున్న పరశురామరాజు తదితరులు

డాబాగార్డెన్స్: స్వాతంత్య్ర ఉద్యమంలో నేతాజీ ఒక ప్రభంజనమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పరశురామరాజు అన్నారు. ఆజాద్ హింద్ ఫౌజ్‌ను స్థాపించి యువతలో జాతీయ భావాలు పెల్లుబికేలా చేశారన్నారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా రోటరీక్లబ్ వైజాగ్ మెట్రో ఆధ్వర్యంలో ఇసుకతోట జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రోటరీ జిల్లా అసిస్టెంట్ గవర్నర్ కె. సునీత లావణ్య, క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ గంగాధర్ మాట్లాడుతూ భారత స్వాతంత్య్ర ఉద్యమంలో నేతాజీ పాత్రను తెలియజేశారు. క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు, రొటేరియన్ మొదిలి మహేష్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయిని అనుపమ, బోధన, బోధనేతర సిబ్బంది, క్లబ్ డైరెక్టర్లు ఇమ్మి కిరణ్, పీబీఎస్ఎన్ రెడ్డి, వెంకట్, ఎ.కిరణ్, తిరుపతిరావు, క్లబ్ పూర్వ అధ్యక్షుడు కె. కిరణ్‌కుమార్, కోశాధికారి బైరెడ్డి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సిరులతల్లికి పంచామృతాభిషేకం



డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. ఈ ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచ్, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శోభారాణి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ముగిసిన త్యాగరాజ ఆరాధనోత్సవాలు

మద్దిలపాలెం: కళాభారతి ఆడిటోరియంలో వారం రోజుల పాటు వైభవంగా జరిగిన త్యాగరాజ ఆరాధనోత్సవాలు గురువారంతో ముగిశాయి. దేశం నలుమూలల నుంచి వచ్చిన ప్రఖ్యాత కళాకారుల గాత్ర కచేరీలతో సంగీతప్రియులు తన్మయులయ్యారు. ఉత్సవాలలో 1100 మంది కళాకారులు పాల్గొన్నారని కళాభారతి ట్రస్ట్ కార్యదర్శి డాక్టర్ గుమ్ములూరి రాంబాబు తెలిపారు. గత 28 సంవత్సరాలుగా త్యాగరాజ ఆరాధనోత్సవాలను నిర్వహిస్తున్నామని, ఈ ఏడాది ఏడు రోజుల పాటు నిర్వహించడం ఆనందంగా ఉందని తెలిపారు.

అలరించిన రాంబాబు గాత్ర కచేరీ

కళాభారతి, త్యాగరాజ ఆరాధన ట్రస్ట్ కార్యదర్శి డాక్టర్ గుమ్ములూరి రాంబాబు తన గాత్ర కచేరీతో సంగీత ప్రియులను అలరించారు. అనంతరం సంగీత కళాభారతి జయలక్ష్మి గాత్ర కచేరీ అద్భుతంగా సాగింది. పంచముఖ ఆంజనేయ స్వామికి 108 వడల మాలను సమర్పించారు. వేద పండితులు చతుర్వేద పారాయణం చేశారు. వందలాది మంది హనుమాన్ చాలీసా పఠనం చేసి హనుమత్ ఉత్సవం నిర్వహించారు. శ్రీరాముడిని అష్టోత్తర శతనామావళితో అర్చించి, ఉత్సవాలకు ముగింపు పలికారు. అధ్యక్షుడు మంతెన సత్యనారాయణ రాజు మాట్లాడుతూ ఉత్సవాలను విజయవంతం చేసిన కళాకారులకు, ప్రేక్షకులకు ధన్యవాదాలు తెలియజేశారు.



త్యాగరాజ కృతులను ఆలపిస్తున్న ట్రస్ట్ కార్యదర్శి డాక్టర్ గుమ్ములూరి రాంబాబు

చినగదిలి కూడలిలో పశువుల సంచారం



చినగదిలి కూడలిలో వాహనాల మధ్య రోడ్డు దాటుతున్న ఆవులు

ఆరిలోవ: బీఆర్‌టీఎస్ రోడ్డులో చినగదిలి కూడలి వద్ద ఆవులతో వాహనచోదకులు ఇబ్బంది పడుతున్నారు. ప్రతి రోజు ఇక్కడ ఉదయం సమయంలో ఆవుల మంద రోడ్డు దాటుతుంది. రోజూ ఉదయం 7.45 గంటల నుంచి 8 గంటల మధ్యలో సుమారు 10 వరకు ఆవులను వాటి యజమాని ఇక్కడ కూడలి దాటిస్తుంటాడు. ఆ సమయంలో నగరంలో ఎంవీపీ కాలనీ వైపు వెళ్లే విద్యార్థులతో నిండిన పాఠశాలల బస్‌లు, మధురవాడ, తగరపువలస వైపు కళాశాలలకు వెళ్లే బస్‌లు, ఆటోలు, కార్లు, ద్విచక్రవాహనాలతో రోడ్డు రద్దీగా ఉంటుంది. అదే సమయంలో ఆవులు రోడ్డు దాటుతూ వానచోదకులకు ఆటంకంగా నిలుస్తున్నాయి. ఆవులు ఇష్టానుసారం కూడలిలో తిరగడం, వాహనాల హారన్లకు రోడ్డు మధ్య పరుగులు తీయడంతో వాహనచోదకులు ఒక్కోసారి వాటిని ఢీకొనడం, తప్పించబోయి డివైడర్లను ఢీకొని ప్రమాదాలకు గురవడం జరుగుతోంది. పెద్ద ప్రమాదాలు జరగకముందే ట్రాఫిక్ పోలీసులు దీనిపై చర్యలు చేపట్టాలని వాహనచోదకులు కోరుతున్నారు. వాహనాల రద్దీ లేని సమయంలో వాటిని రోడ్డు దాటించేలా యజమానికి సూచించాలని చెబుతున్నారు.



చినగదిలిలో డివైడర్‌పై నుంచి రోడ్డు దాటుతున్న ఆవులు